




# చుక్కల్లో మచ్చ

కన్నోజు మనోహర్

అవునూ....! ఈ చుక్కలిపుడు లెక్కెట్టానా? వుహూ. లేదు లేదు మళ్ళీ లెక్కడతాను. ఒకటీ రెండు మూడు నాలుగు—అరె ఈ చుక్క అచ్చం అలాగే అలాగే ఆయన లాగానే మెరుస్తోంది. అబ్బ ఎంత అందంగా మెరుస్తోంది!! ఛ.... ఛ! అతనెవరు. తనెవరు వెధవాలోచన. అయిదూ ఆరు ఏడు ఎనిమిది నిజంగా ఆయన ముక్కు ఎంత అందంగా వుందని. పొద్దున స్నానం చేసొచ్చి చీర కట్టుకుంటోంటే ఆ కిటికీలో నుంచి ఎంత 'యిది'గా చూస్తున్నాడో! తొందరగా పక్కకి జరగడం నయమైంది. లేకపోతే.. అయినా నాలో యేం చూశాడోయేమో!! కాని చాటుగా కట్టుకుందామంటే. ఈ చిన్ని ఇంట్లో ఎక్కడుంది స్థలం. ఛ....ఛ! ఏం బతుకు!! పది పదకొండు పన్నెండు వాడుకూడా పొద్దున నేను భుజం మీద జాకెట్ చిరిగినందుకు కుట్టుకుంటున్నపుడు బుస్....బుస్‌అనెవరంటున్నారబ్బఅనుకుని అటువైపు చూసినందుకు సన్నగా కన్నుగీటాడు. అంటే.... తన్ను పిలుస్తూ అలా చేశాడన్నమాట. అయినా—అచ్చం మొన్న రాణి తీసికెళ్ళిన సినిమాలోని హీరోకూడా యిలాగే ఓ అమ్మాయినిచూసి కొడుతోంటే అబ్బ! ఎంత 'యిది'గాదే అంటూ రాణి తన భుజంమీద నవ్వుతూ పొడిచినట్టు యింకా జ్ఞాపకం. మధ్యాహ్నంకూడా నిజంగా అతనలాగే కన్నుగొడుతోంటె గమ్మత్తనిపించింది. ఛ....! ఛ.... యేం పాడాలోచనలో ఈ జీవితానికి.

బాప్‌రే.... కుక్క మొరుగుతోంది. బహుశా పన్నెండుకావచ్చు....అవునూ.... ఆ టక్కు టక్కు చప్పుడు ఆ గూర్ఖా గాడిదే. సరిగ్గా రెండో ఆట సినిమా వొదిలింతర్వాత ఓ గంటకొస్తాడు. అంటే.... యిప్పుడు.... బహుశా ఒకటి అయిపోయుంటుంది. యింక పండుకోవాలి. పొద్దున్నే లేస్తే మళ్ళీ వీధి కుళాయికెళ్ళి నీళ్ళు తీసుకురావడం. వదిన పిల్లలకి స్నానాలు చేయించి, తనూ చేసొచ్చి వంట మీద కూర్చుని. మళ్ళీ వదినకొచ్చిన గిరాకీ బట్టల్ని కుట్టడం....మళ్ళీ వంట... ఓహ్.... తొందరగా నిద్రపోవాలి. మళ్ళీ పొద్దున్నే లేవకపోతే యింకేమైనా వుందా.... వదిన చూపులు.... దెబ్బలు.... తిట్లు.... అమ్మో.... ఎలా.... ఎలా నిద్రపోవడం. రావడంలేదే.... అవును. కళ్ళు మూసుకుంటే రావొచ్చు. అవును! అలాగైనా వస్తుందేమో చూడాలి.

నిన్న నీళ్ల తీసుకు రావడానికెళుతోంటే వెనక నుంచి వాడెవడో "పద్మాలో మ్యాట్నీ పిక్చర్‌కి రా.... నేనక్కడే వుంటాను" అంటూనే వెళ్ళిపోయాడు. వాడ్నెక్కడో చూసినట్టుంది.... చాలా అందంగా కూడా వున్నాడు. కాని అలా వెళ్తే బావుంటుందా!! యేమో ఓ సారి వెళ్తే.... అబ్బో... ఒక్కక్షణం యింట్లో తను లేకపోతే వొదిన చీరి పారేస్తుంది. కాని రాణి ఎన్నోమార్లు ఎందరెందరితో వెళుతుంటుంది. వాళ్ళతో ఆ పిక్చర్ హాల్లో తనేం మాట్లాడింది. వాళ్ళు తనతో యేం మాట్లాడారు అన్ని పూసగ్రుచ్చినట్లు చెవుతోంటే ఎంత ఆనందమనిపిస్తుంటుంది. తను కూడా అలాగే ఆ ప్రొద్దున నవ్వినతడితో వెళ్తే - ఛ.... యేమాలోచనలు.... అరే! నిద్ర.. నిద్రెలాపట్టాలి.. యింక ఈ రాత్రికి నిద్ర రాదేమో....!! యెప్పుడో ఓ రాత్రికి నిద్రొస్తే మళ్ళీ అంత పొద్దున లేవడం ఎలా సాధ్యం.... భగవంతుడా తొందరగా నిద్రనియ్యి. నీకు నా పెళ్ళయిన తర్వాత నా భర్తని డబ్బులడిగి నీకో కొబ్బరికాయ కొడతాను.

అరె పెళ్ళి.... పెళ్ళి.... తన పెళ్ళి.... ఎంత అందమైన పందిరి.... ఎంతమంది బంధువులు.... ఆ మంగళతోరణాలు.... ఆ బాజా భజంత్రీలు ఆ పెళ్ళిపందిట్లో తనూ, తనకాబోయే మొగుడూ పక్కపక్కనే.... ఎవడతను....ఎలా వుంటాడు అందంగా... ఔను.... తన్నిచూసి రోజూ పొద్దున్నే నవ్వే వాడిలాగానా.... లేదా.... తనని సినిమాకి రమ్మన్నవాడిలాగానా.... వొదిన లేనపుడు 'అబ్బో....నీపక్క తేలు' అంటూ ఒక్కసారిగా తనవైపుకు లాక్కున్నవాడిలాగానా.... తను కనబడుతున్నపుడల్లా కొంటెగా నవ్వుతూ కన్ను గొడుతుండే వాడిలాగానా.... రాణి ఇంటికి రాత్రి వేళల్లో వస్తూపోతూ తన వైపుకి కూడా 'అదోలా' మరి మరి చూస్తోండేవాడిలాగానా.... యేమో! ఎలా వుంటాడో అందరూ అందంగానే కనిపిస్తున్నారు. కాని....తనొక్కదానికి యింతమంది మగవాళ్ళు యిలా.... 'ఆడదాని వయసూ, మనసూ ఒకరికే అంకితమివ్వాలి' తను ఏడవ తరగతిలో ఉన్నపుడు ఏదో పాఠం చెబుతూ తెలుగు మాస్టారు అన్నది 'నిజమే' కావచ్చు. నిజమే.... నిజంగానే అది నిజం.... మరి తను కూడా ఒకరికే యివ్వాలి.... అది కూడా తనకాబోయే భర్తకి.

అరే.... యేమానందం.... ఓహ్.... 'ఇది తీయని వెన్నెల రేయి మది వెన్నెల కన్నా హాయి'-అరె పొద్దున వదిన కొట్టిన దెబ్బలతో రెండోపక్కకి నొప్పియ్యి, ఒకే పక్కకి పడుకున్నా— మరి యిప్పుడెలా దొర్లుతున్నాను. అరె.... అసలు నొప్పే లేదు-అస్సలు లేదు.... వుహూ.... మళ్ళీ వొస్తున్నాయి. ఓహ్....నొప్పి....మరి.... మరి.... యింతకుముందెలా పక్కకి దొర్లాను. ఇలా.... ఇలా.... ఇలా.... ఓ.... 'భర్త'అనుకునేసరికి ఈ పిచ్చి హృదయం తీయగా మూలిగింది. ఆనందంతో తేలియాడుతోంది పిచ్చిది. అంతా తన పిచ్చి ఆలోచనలేకాని ఈ టి.బి దాన్నెవడు పెళ్ళి చేసుకుంటాడు.

తన జీవితానికి పెళ్ళి.. ఎవడు చేస్తాడు తనకీ.... తల్లి తన్నొదిలేసి పోతూ అన్నయ్య చేతిలో పెడితే తనకి పెళ్ళి చేస్తా

నన్నాడు.... బాగా చూసుకుంటానని కూడా అమ్మకి మాటిచ్చినా. ఈనాడు వొదినా. అన్నయ్య ఇద్దరూకలసి అనవసరంగా ఏ కారణం లేకుండానే ఏదో చిన్నసాకుతో కొడుతున్నారు.


ఓసారి.... "నీవెప్పుడు ఛ సవే.... దరిద్రపుముండా.... ఫో.... పోయి ఎక్కడన్నా అడుక్కుతిను.. లేదా ఎందులో నన్నాపడి చావు." అంటూ యేకారణం లేకుండానే తిట్టినపుడు తానెంత ఏడ్చిందని.

'అనవసరంగా యెందుకేడుస్తున్నావ్' అంటూ వెంటనే వొదినొచ్చి కొడితే నాలుగు రోజులవరకూ వీపుమీద వాతలలాగే వుంటే. రాణీ వచ్చి వేడినీళ్ళతో కాపుతూ వుండిపోయింది.

నిజంగా తాను చచ్చిపోవాలి.... ఎందుకీ జీవితం. తల్లిదండ్రులు లేకుండా అన్నయ్యా. వదిన వుండి లేనిసమానంగా వున్న ఈ రోగిష్టి దాన్నెవడు పెళ్ళి చేసుకుంటాడు. చూసుకుంటాడు.

అసలు నేనెందుకున్నాను. భూదేవికి మరో మనిషి బరువు. తల్లి తన బిడ్డ అన్యాయమైపోతోంటే చూడదుగదా.... మరి....ఈ భూదేవి తల్లి గదా. ఎంతమంది నాలాంటి వాళ్ళకన్యాయమైపోతోంటే మరి ఈ భూదేవెలా చూస్తూ వూర్కొంటుంది. యేదేమైనా నా జీవితం పాడు. ఛస్తాను.... ఈ రోజెలాగైనా ఛస్తాను. యింక ఈ జీవితానికి వుపయోగం లేదు. ఈ దెబ్బలు.... ఈ మాటలు.... ఈ చూపులు భరించలేను.

పాం....పాం.... అంటూ మిల్కువాన్ వచ్చిన చప్పుడుకి చటుక్కున ఆలోచనల నుండి తేరుకుని. వెంటనే వురుకుల్తో. పరుగుల్తో బిందె తీసుకుని నీళ్ల తీసుకురావడానికి బయల్దేరింది తెల్లవార్లూ చుక్కల్నిచూస్తూ ఆలోచించిన కాంతి.




బెజవాడ రైల్వే స్టేషను 'కోణార్క్'లో దిగిన జనంతో రద్దీగా వుంది. స్టేషన్ ముందు బేరాలకోసం పడిగాపులు పడి కూర్చున్నా రిక్షావాళ్ళలో చైతన్యం కలిగింది.

బేరాలు పోతాయేమో అన్న భయంతో గిట్టుబాటు కాకపోయినా పోటీల మీద కట్టేస్తున్నారు రిక్షాల్ని. ఏసయ్య కూడా అదే ఆరాటంలో వున్నాడు. ఇంతలో ఒక ఆసామీ సూట్ కేసు. మనీ బేగ్ పట్టుకుని భారీ కాయాన్ని భారంగా మోసుకుంటూ వచ్చి ఏసయ్య రిక్షాలో ఎక్కేశాడు బేరం ఆడకుండానే. ఏసయ్య దేవుణ్ణి తలచుకొని ఆసామీ చెప్పిన సత్యనారాయణపురంవైపు దారితీశాడు. అడ్రసు సరిగ్గా తెలియని ఆసామీ రిక్షాని కాసేపు అటూ. ఇటూ తిప్పించి చివరకి ఒకచోట దిగిపోయాడు. మంచినీళ్ళు త్రాగడంకోసం రిక్షాని రోడ్డువక్కగా ఉంచబోతున్న ఏసయ్యకళ్లు జిగేల్మన్నాయి. సీటుమీద నిగనిగలాడుతూ నల్లటి మనీబేగ్. ఏసయ్య నెమ్మదిగా తీశాడు. పాపం ఆసామి అడ్రసు తెలియని హడావిడిలో సంచివదిలేశాడు అనుకుంటూ జిప్‌లాగాడు. నిండా నోట్లకట్టలు. వదివేల రూపాయలకు తక్కువ ఉండవు. సంతోషం భయం రెండూ కలగలిసిపోయాయి. గుండెల్లో ఏదో గాబరా. చుట్టూ చూశాడు. ఎవరూ తనని గమనించడంలేదు. - ఈ డబ్బు తీసేసుకుంటే తను సొంతంగా రిక్షాను కొనుక్కోవచ్చు. తన కుటుంబం కష్టాల్నుంచి గట్టెక్కుతుంది. ఆసామీ తన రిక్షాలోనే డబ్బుసంచి వదిలేశాడన్న ఋజువేమిటి? - ఆలోచిస్తున్న ఏసయ్యకు ఒక్కసారి ఎవరో ఛళ్ళున చరిచినట్లయింది. చమటోడ్చి. కష్టపడైనా ఇప్పటి వరకు నీతిగా. నిజాయితీగా వున్న తన బ్రతుకు తననే వెక్కిరించినటయింది. ఛీ ఏమిటి ఇలా ఆలోచిస్తున్నాను అనుకున్నాడు వెంటనే.

"ఆ మనిషి ఎవరైతే ఏం అతను సంచిని నా రిక్షాలో మర్చిపోయాడు. అది అతనికి అందజేయడం నా ధర్మం. అంతే కాని దాన్ని తీసుకుని కిమ్మనకుండా ఊరుకోవడం అన్యాయం కాదూ. ఎవరూ చూడక పోతే ఏం? దేవుడు చూడూ! ఎంత ఎదవ ఆలోచన వచ్చింది ఈవాళ" అనుకున్నాడు. అనుకున్నదే తడవు పోలీస్‌స్టేషను కెళ్లాడు. అదే సమయానికి ఆసామీ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడుతూ కనబడ్డాడు ఏసయ్యకు. తిన్నగా వాళ్ళదగ్గరకెళ్ళి సంగతిచెప్పి డబ్బుసంచి ఇచ్చేశాడు. పెట్టింది పెట్టినట్టున్న ఆ డబ్బును చూసుకోగానే ఆసామీ ముఖం చాటంతయింది. ఇన్‌స్పెక్టరు ఏసయ్య మంచితనాన్ని. నీతి నిజాయితీలను ఎంతో మెచ్చుకుని సంతోషపూర్వకంగా ఆసామిచేత ఏసయ్యకు ఏభై రూపాయలు ఇప్పించాడు. అయితే అక్కడే వచ్చింది చిక్కు. ఆ ఏభై రూపాయలు ఏసయ్యలో అలజడి రేపాయి. అద్దె రిక్షా ఎక్కినప్పుడల్లా ఏసయ్యకు ఆ పదివేలూ గుర్తొస్తాయి. 'న్యాయంగా నీతిగా నిలబడినందుకు తనకు ఏభై రూపాయలు దక్కాయి. కాని న్యాయం మర్చిపోయి. అవినీతిని నిద్ర లేపి. అధర్మానికి చోటిచ్చి తను గనుక గుట్టుచప్పుడు కాకుండా ఆ సంచిని దాచేస్తే అప్పుడు పదివేలూ దక్కేవి. న్యాయం విలువ ఏభై రూపాయలు. అన్యాయం విలువ పది వేలూనా. ఎంత విచిత్రం.' ఇలా ఆలోచనల్తో ఎన్నిసార్లు తలబ్రద్దలు కొట్టుకున్నా దాగిన సత్యంలో మహత్యం అర్థంకాక అసలు న్యాయానికే అన్యాయం జరిగిపోయిందని బాధపడిపోతుంటాడు ఏసయ్య.

